## ఏసీబీ వలలో వీఆర్‌వో



కేవీబీ పురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:
కేవీబీపురంలో తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్లపూడి గ్రామానికి చెందిన శేఖర్ అనే రైతు పెదనాన్న పేరు మీద ఉన్న పొలం కొంత సెటిల్‌మెంట్ కొంత వోల్టాకు సంబంధించిన పొలంను తనపైకి మార్చేందుకు పట్టా చేసేందుకు శేఖర్‌ని 20 వేలు తెమ్మని వీఆర్‌వో డిమాండ్ చేసినట్లు, రైతు శేఖర్ ముందుగా 5 వేలు ఇస్తానని మాట కట్టుకుని సోమవారం ఉదయం మండల కేంద్రంలోని కేవీబీ పురం ప్రధాన బస్టాండ్ కూడలి వద్ద ఐస్ ఫ్యాక్టరీ వద్ద రైతు వీఆర్‌వోకు 5 వేలు శేఖర్ ఇచ్చాడు. కాపు కాసిన ఏసీబీ అధికారులు వీఆర్‌వో మునిరాజాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలోకి ఏసీబీ అధికారులు ప్రవేశించి సాయంత్రం వరకు రెవెన్యూ కార్యాలయం రికార్డులను పరిశీలించారు. వీఆర్‌వో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలిస్తున్నట్లు వారు తెలిపారు. ఏసీబీ అధికారులు, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కల్యాణవెంకన్నగా గోవిందరాజస్వామి

తిరుమల, ఫిబ్రవరి 19ప్రభాతవార్త:



తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయం పుష్కరిణిలో జరుగుతున్న తెప్పోత్సవాల్లో సోమవారం సాయంత్రం స్వామి వారు కల్యాణ వేంకటేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెప్పోత్సవాల్లో మూడవరోజు సాయంత్రం స్వామి వారు ఉభయదేవేరులతో కలసి తెప్పపై వేంచేపు చేశారు. ఇక్కడ ఆలయ అర్చకులు కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. భక్తుల గోవిందనామస్మరణల మధ్య తెప్ప పుష్కారిణిలో ఐదుప్రదక్షణలు చేయించారు.

### సిఎం జగన్ పర్యటన విజయవంతానికి

# పక్కా ఏర్పాట్లు

### - కలెక్టర్ సగిలి షన్మోహన్



అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:
సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేది కుప్పం నియోజకవర్గం శాతిపురం మండలంలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారని, సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనను జిల్లా అధికార యంత్రాంగం సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ సిఎం పర్యటన విజయవంతం చేయడానికి అధికారులతో సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సిఎం పర్యటనకు సంబంధించి అధికారులకు నిర్ధేశించిన విధులను పక్కాగా నిర్వహించి ఎటువంటి పొరబాట్లకు తావు లేకుండబా విధులు నిర్వర్తించి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా సిఎం పర్యటనకు సంబంధిచి శాఖల వారీగా కేటాయించిన విధుల నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఎ హౌసింగ్ పిడి డిఎంకె తులసీ, మెప్మా పిడి రాధామ్మ, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, డిఇఓ దేవరాజులు, పిఆర్ ఎస్ఇ చంద్రశేఖర్‌ంరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, ఆర్అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డి, డిప్యుటీ కలెక్టర్ శివయ్య, సమగ్ర శిక్ష ఎసిపి వెంకటరమణారెడ్డి, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, సిపిఓ సాంబశివారెడ్డి, ట్రాన్స్‌కో ఇఇ శ్రీహరి, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, డిఎల్‌డిఓ రవికుమార్, కలెక్టరేట్ ఎఓ వెంకటేశ్వర్లు, ఎస్‌బి డిఎస్పీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరులో ఎవరెవరికి పోటీ!



ప్రభాతవార్త - చిత్తూరు
సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి చిత్తూరు అసెంబ్లీ స్థానం నుండి ప్రధాన పార్టీలైన అధికార వైకాపా, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీల నుండి అభ్యర్థులు ఎవరనే విషయంపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో నాయకులు, కార్యకర్తలు సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అధికార వైకాపా చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా ఇప్పటికే అర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెరెడ్డిని నియమించడంతో ఆయన ప్రచారం ముమ్మరం చేశారు. అదే సమయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఎమ్మెల్యే అభ్యర్థిత్వంకు బదులు రాజ్యసభకు నామినేట్ చేస్తామని హామీ ఇచ్చి వైకాపా అధిష్టానం హామీ అమలు చేయలేదు. రాయలసీమ జిల్లాల్లో బలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని ఎవరికి అధికార వైకాపా అభ్యర్థిత్వం ఇవ్వకపోవడంతో చివరి నిముషంలో అధికార వైకాపా తమ సామాజిక వర్గానికి చిత్తూరు టిక్కెట్ కేటాయిస్తుందని ఆశతో ఆ సామాజిక వర్గ నేతలు ఆశల్లో విహరిస్తున్నారు. ఇక ఇతర రాజకీయ పార్టీల విషయానికి వస్తే చిత్తూరు నుండి ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశం అభ్యర్థిని నిలబెడుతుందా! మిత్రపక్షం జనసేన పార్టీకి ఈ స్థానం కేటాయిస్తుందా! అనేది ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఈ పరిస్థితుల్లో ఇక్కడి నుండి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయడానికి సిద్ధమైన నాయకులు చిత్తూరు అసెంబ్లీ స్థానం పరిధిలో ముకుమ్మడి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ఇక్కడి నుండి పోటీకి సిద్దంగా వున్న దివంగత టిటిడి ఛైర్మన్ డికె ఆదికేశవులు కుమార్తె తేజేశ్వరీ, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీలు, మాజీ జడ్పీఛైర్‌పర్సన్ గీర్వాణీ భర్త చంద్రప్రకాష్, సీనియర్ తెలుగుదేశం నాయకులు, పారిశ్రామికవేత్త గురజాల జగన్మోహన్‌నాయుడు, సిఆర్ రాజన్‌లు మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు సారధ్యంలో కలసికట్టుగా తెలుగుదేశం పిలుస్తోంది...! రా...! కదలిరా...! కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అధికార వైకాపా ఇక్కడి నుండి బలిజ సామాజిక వర్గంను ప్రక్కకు పెట్టడంతో ప్రతిపక్ష తెలుగుదేశం ఈ వర్గంకు ఇక్కడి నుండి ఈ సారి ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ వర్గం నుండి మాజీ టిటిడి ఛైర్మన్ దివంగత డికె ఆదికేశవులు కుమార్తె తేజోశ్వరీ అగ్రభాగంలో నిలవనున్నారు. అలాగే ప్రముఖ పారిశ్రామికవేత్త గురజాల జగన్మోహన్‌నాయుడు, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణీ భర్త చంద్రప్రకాష్‌లో మరొక సామాజిక వర్గం నుండి అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్నారు. ఈ సామాజిక వర్గం నాయకుల గురించి పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వద్ద పూర్తి సమాచారం వుండటంతో ఈ వర్గం నుండి అభ్యర్థి ఎంపిక చంద్రబాబునాయుడు చేతుల్లోనే వుంటుంది. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో బిసీలు అధికంగా వుండటంతో తిరుచానూరు నుండి ఇక్కడికి వచ్చి మకాం వేసిన సిఆర్ రాజన్ చిత్తూరులో బిసీల ఐక్యత కోసం సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే తెలుగుదేశం అధిష్టానం ఈ ఎన్నికల్లో ఎవరికి అవకాశం కల్పిస్తుందనే విషయంపై ఇప్పటికీ సస్పెన్స్‌గానే మారింది. ఒకవేళ ఈ నియోజకవర్గ పరిధిలో బలిజ సామాజిక వర్గం అధికంగా వుండటంతో ఈ స్థానంను జనసేనకు కేటాయిస్తే ఇక్కడి నుండి మాజీ టిటిడి ఛైర్మన్ డికె ఆదికేశవులు మనవరాలు చైతన్య ఆ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే అధికార వైకాపా అభ్యర్థిత్వం ఎంసి విజయానందరెడ్డికి ఖాయం అని ప్రచారం జరుగుతుండటంతో ప్రతిపక్ష తెలుగుదేశం ఇక్కడి నుండి తమ పార్టీ అభ్యర్థికి సీటు కేటాయిస్తుందా! అలా సీటు తెలుగుదేశంకు కేటాయిస్తే అభ్యర్థిగా ఎవరిని ఖరారు చేస్తుంది! ఒకవేళ చిత్తూరు స్థానం జనసేనకు కేటాయిస్తే ఇక్కడి పరిస్థితి ఏమిటీ! అనే విషయాలు వారం రోజుల్లో ఒక కొలిక్కి వచ్చే అవకాశం కన్పిస్తోంది.

## అడవిపంది దూకుడుతో ఆటో డ్రైవర్ మృతి

చంద్రగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:



ఆటో డ్రైవర్ ముందు అడవి పంది దూకుడుగా వెళ్ళడంతో ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన విచారకర దుర ్ఘటన సోమవారం ఉదయం బి.కొంగరవారిపల్లి సమీపంలో చోటుచేసుకున్నది. గ్రామస్థుల కధనం మేరకు.. రేణిగుంట మండలం, కృష్ణాపురంకు చెందిన చంద్ర (55) రేణిగుంట సమీపంలోని ఓ దినప్రతిక కార్యాలయం నుండి చిన్నరామాపురంకు న్యూస్ పేపర్లను తీసుకెళుతున్నారు. మార్గమధ్యలో బి.కొంగరవారి పల్లి నుండి వెళుతుండగా ఊహించని రీతిలో అడవి పంది వేగంగా రోడ్డు దాటుతుండగా ఉలిక్కిపడిన చంద్ర ఆటోను అదుపు చేయలేకపోవడంతో బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుబ చేపట్టారు.

## దుర్గామల్లేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



విజయవాడ ఇంద్ర కీలాద్రిపై వెలసిన దుర్గామల్లేశ్వరాలయ స్వర శిఖర కుంభాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారక శ్రీనివాసులు మరియు దేవస్థానం అధికారులు కలసి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈసందర్భంగా దుర్గగుడి ఈవో రామారావు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ఏఈవో ధనపాల్, వేదపండితులు శివప్రసాద్‌శర్మ మరియు దేవస్థానం అధికారులు, పరిచారకులు పాల్గొన్నారు.

## నేటినుంచి కుప్పంలో నారా భువనేశ్వరి పర్యటన

### - బాధిత కుటుంబాలకు పరామర్శ.. అన్న క్యాంటీన్లు ప్రారంభం



కుప్పం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త
తెదేపా అధినేత, మాజీ సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి నారా భువనేశ్వరి 20,21 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటి ంచనున్నారు. ఈ మేరకు పర్యటన పూర్తి వివరాలను ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మీడియాకు వెల్లడించారు. నిజం గెలవాలి కార్యక్ర మంలో భాగంగా ఈనెల 20వతేదీ మధ్యాహ్నం 2.30గంటలకు బెంగళూరు నుంచి గుడుపల్లె మండలం కొడతనపల్లికి చేరుకుంటారు. అక్కడ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.05గంటలకు గుడుపల్లెలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారు. 4.50గంటలకు మల్లప్పకొండ ఆలయాన్ని సందర్శిస్తారు. 6.15గంటలకు యామనూరులో బాధిత కుటుంబాన్ని పరిమర్శిస్తారు. రాత్రి 7గంటలకు కుప్పంలోని చర్చిలో ప్రార్థనలు చేపడతారు. 8గంటలకు చంద్రబాబు కార్యదర్శి మనోహర్ ఇంటికి వెళ్తారు. 9గంటలకు కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహం చేరుకుంటారు. 21న ఉదయం 10.10గంటలకు శాంతిపురంలో మహిళలతో జరిగే ఆర్థిక స్వేచ్ఛ ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొంటారు. 11.20గంటలకు శాంతిపురంలో, 12.20 గంటలకు రామకుప్పంలో అన్న క్యాంటీన్లు ప్రారంభించిన అనంతరం పలమనేరు నియోజకవర్గంకు చేరుకుని అక్కడ పర్యటి ంచనున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున నారా భువనేశ్వరి విద్య, వైద్యం, రక్తదానం, తుఫాన్ల సమయంలో ప్రజల్ని ఆదుకున్నారన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో కుప్పం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

### భూ సమస్యల్లో అవకతవకలు పాల్పడితే

# కఠిన చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా



డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా

గూడూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త
గూడూరు డివిజన్‌లో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని భూ వివరాల నమోదులో అధికారులు అలసత్వం వహిస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా హెచ్చరించారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు తెలియజేసారు. సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. అదే విధంగా ఓజిలి మండలం పాలెంపట్టు గ్రామానికి చెందిన మద్దెల మస్తానయ్య అనే దివ్యాంగుడు ట్రై సైకిల్ కావాలని కలెక్టర్‌కు తెలియజేయగా వెంటనే తిరుపతి నుండి ట్రై సైకిల్ తెప్పించి కలెక్టర్ చేతులు మీదుగా అందజేసారు. ప్రత్యేక వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ డివిజన్ స్థాయిలో స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్నాయని దీంతో భూ సమస్యలు తెలియజేశారని అన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ సక్రమంగా ప్రజలకు వస్తున్నాయని తెలిపారు. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఎక్కడైనా భూ వివరాల నమోదులో అధికారులు అవకతవకలకు పాల్పొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చుక్కల భూములు విషయంలో కూడా అధికారులు స్పందించి రైతుల సమస్య పరిష్కరించాలన్నారు. చిట్టమూరు మండలంలో రైతులకు తెలుగు గంగ నీటిని చెరువులకు విడుదల చేయాలని ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ మేరుగ మురళి కలెక్టర్‌కి రైతులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా మంగళపూర్ వద్ద ఇటీవల ఓ మైనింగ్ ప్రజాప్రాయ సేకరణ అధికారులు నిర్వహించారని ఇక్కడ మైన్ ఏర్పాటు చేస్తే పొల్యూషన్ వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలు ప్రజలు అనారోగ్యం నష్టపోతారన్నారు. దేగ సురుష్ వినతిపత్రం అందించారు. ఆర్‌డిఓ కిరణ్ కుమార్, రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐ మనోజ్ కుమార్, డివిజన్‌లోని అన్ని మండలాల తహశీల్దార్లు, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## స్పందనలో వచ్చే ప్రజా సమస్యలకు ప్రాధాన్యత

### ఎస్పి మల్లికా గార్గ్



తిరుపతి క్రైం, జనవరి 19, ప్రభాతవార్త
జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని ఎస్పి మల్లికా గార్గ్ నిర్వహించి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను ఖుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపారు. స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు , ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ప్రజలు ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పి కార్యాలయానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 82 మంది వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి ప్రయాసపడి ఎస్పీ కార్యాలయానికి రాలేని వృద్ధులు, మహిళలు వారి పరిధి పోలీస్ స్టేషన్ల నందు ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా స్పందన ఫిర్యాదు లాగానే పరిగణించి, పరిష్కరించడం జరుగుతుందన్నారు.

## మున్సిపల్ పార్కులు శుభ్రంగా ఉంచండి

### కమిషనర్ అధితి సింగ్



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త
తిరుపతి నగరంలోని మున్సిపల్ పార్కులను శుభ్రంగా ఉంచాలని, పార్కుల్లో మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో కమిషనర్ అధితి సింగ్ అర్జీలను స్వీకరించారు. స్పందనలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ మజ్జిగ కాలువ వద్ద ఏడు ఎకరాల్లో నిర్మిస్తున్న భవనాలకు అనుమతులున్నాయా అని పరిశీలించమని ఇది వరకే చెప్పినా ఇంత వరకు పరిశీలించలేదన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రరెడ్డి, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, ఫైర్ అధికారి శ్రీనివాసరావు, మేనేజర్ చిట్టి బాబు, సూపరింటెండెంట్ పి. రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గెలుపు గుర్రాల కోసం టిడిపి అన్వేషణ

### - సర్వేల పేరుతో రోజుకో అభ్యర్థి పేరు హల్‌చల్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త
సూళ్లూరుపేట శాసనసభ నియోజకవర్గంలో గత వైభవాన్ని ఎలాగైనా తీసుకురావాలన్న దృఢ సంకల్పంతో తెలుగుదేశం పార్టీ అధిష్టానం గెలుపు గుర్రం కోసం అన్వేషణ ప్రారంభించింది. ముందుగానే వైసీపీ అభ్యర్థిగా రెండు పర్యాయాలు సూళ్లూరుపేటలో గెలుపొంది బలమైన అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్న కిలివేటి సంజీవయ్యను ఢీకొనాలంటే అందుకు తగ్గట్టుగా అభ్యర్థి ఎంపిక చేపట్టాలని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎంపికను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేస్తోంది. నియోజకవర్గంలోని నాయకుల అభిప్రాయాలను తీసుకుంటూనే మరోవైపు అధిష్టానానికి అభ్యర్థిత్వం పరిశీలించమని వచ్చిన పేర్లను ఐవిఆర్ఎస్ సర్వే పేరుతో ప్రజల్లోకి పంపుతూ వారి అభిప్రాయాలను తెలపాలని ఫోన్ ద్వారా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గత వారంరోజులుగా పోటీలో ఉన్న ఆశావహులైన శ్రీపతి బాబు పేరును ముందుగా ఐవిఆర్ఎస్ సర్వే ద్వారా సూళ్లూరుపేట శాసనసభ పరిధిలోని ప్రజలకు పరిచయం చేసి అభ్యర్థి సరైన వాడయితే సెల్‌ఫోన్‌లో ఒకటి నొక్కాలని, లేకపోతే నోటా కింద రెండు నొక్కాలని సూచించడం జరిగింది. ఇంతటితో సర్వే ముగుస్తుందని భావిస్తుండగానే మరో పేరు రంగంలోకి వచ్చింది. మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె డాక్టర్ నెలవల విజయశ్రీ పేరును సర్వేలో పొందుపరిచారు. ఇంతలోనే మరో మహిళా డాక్టర్ చంద్రకళ పేరును ప్రచారంలోకి తీసుకురావడంతో అసలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికలో ఎటువంటి ఎత్తుగడలు అవలంబిస్తుందో అని కార్యకర్తలు ఎదురు చూపులు చూస్తున్నారు. ఇప్పటివరకు అభ్యర్థుల విషయం సర్వేల పేరుతో సరిపెట్టుకుంటున్నారే గాని అభ్యర్థిని ఖరారు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పనబాక కృష్ణయ్య పేరు ఖరారైందని ముమ్మర ప్రచారం జరిగినా ప్రస్తుతం వస్తున్న సర్వేల పేరుతో అసలు ఏమి జరుగుతుందని స్థానికంగా ఉన్న నేతలు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. మొత్తంమీద తెలుగుదేశం పార్టీ అధిష్టానం మాత్రం సూళ్లూరుపేట శాసనసభ నియోజకవర్గం విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది.

# వైసిపి అక్రమాలపై విచారణ జరిపించండి

### కలెక్టరేట్ ఎదుట సిపిఎం, సిపిఐల నిరసన



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త
చంద్రగిరి నియోజకవర్గం, తిరుచానూరులో వైసిపి నేతల అక్రమాలు, ఆగడాలపై సమగ్ర విచారణ జరిపించాలని దోషులను కఠినంగా శిక్షించి ప్రజలకు శాంతిని కలుగజేయాలని సిపిఎం, సిపిఐ పార్టీలు డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కందారపు మురళి, టి. సుబ్రమణ్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, విశ్వనాథ్‌లు ప్రసంగించారు. గత రెండు రోజుల కిందట తిరుచానూరు సరస్వతి నగర్‌లో పెరుమాల్ అనే వ్యక్తికి చెందిన భూములలో వైసిపి సర్పంచ్ రామచంద్రారెడ్డి సోదరుడు నరేష్ మరికొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ప్రైవేటు భూముల్లో చొరబడి అక్రమ నిర్మాణాలు చేపట్టారని దానిని తాము ఎదుర్కొన్నామని వివరించారు. తిరుచానూరులో వైసిపి నేతల ఆగడాలకు అంతులేకుండా పోయిందని ముఖ్యంగా స్వర్ణముఖి నదిలో ఇసుక తరలించి కోట్లాది రూపాయిలు సంపాదించారని వివరించారు. అదే విధంగా పంచాయితీ పరిధిలో ప్రభుత్వ భూములు, కాలువ పరంబోకు, డీకెటీలు లేకుండా మాయమయ్యాయని ఆరోపించారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి సన్నిధిలో పంచాయితీ స్థలాలలో షాపులు నిర్మించి తమ వైసిపి వారికి కట్టబెట్టారని అన్నారు. జిల్లా కలెక్టర్ తిరుచానూరులో జరుగుతున్న అక్రమాలపై ప్రత్యేక కమిటీని నియమించి విచారణ జరిపించాలని లేని పక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో తామే స్వయంగా పరిశీలన జరిపి అక్రమాలను వెల్లడి చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు జయచంద్ర, సాయిలక్ష్మి, వేణుగోపాల్, మాజీ ఎంపిటిసి సుమన్, శేషాద్రి, మునిశేఖర్, రవి బాధితులు పెరుమాళ్ ఆయన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రజల పాలన కావాలా? పోలీసుల కేసుల రాజ్యం కావాలా? : రిషితారెడ్డి



శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాప్రతినిధులకు అధికారాలు గల పరిపాలన కావాలా? పోలీసులో పరిపాలిస్తూ అక్రమ కేసుల రాజ్యం కావాలో ప్రజలు తెలుసుకోవాలని తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం ఆమె శ్రీకాళహస్తి మండలంలోని ఈంద్రపల్లి,వాగవీడు, గంగల పూడి గ్రామాల్లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ బాబూ గ్యారంటీ పథకాల్లో 6 వరాలను వివరిస్తూ ముందుకు సాగారు.అంతేకాక ఐదేళ్ళుగా గ్రామాల్లో ఒక్క పని చేసారా? పంచాయతీలకు నిధులున్నాయా? సర్పంచ్‌లు పరిపాలిస్తున్నారా? వాలంటీర్లు శాసిస్తున్నారా? అనేది గుర్తించాలని రిషితారెడ్డి పిలుపు నిచ్చారు.ఆమెతో పాటుమండల అధ్యక్షుడు కామేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి రంగినేని చెంచయ్యానాయుడు పాపిరెడ్డి, ఈశ్వరరెడ్డి, హరి,పవన్, రవీంద్రారెడ్డి, బత్తిరెడ్డి, జగదీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ఒక్క మధుసూధనరెడ్డికే సాధ్యం: పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిని 30 సంవత్సరాల పాటు పరిపాలించిన తెలుగుదేశం నాయకులు అభివృద్ధిని గురించి పట్టించుకోక గాలికి వదిలితే మా నాన్న బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సోమవారం ఆమె శ్రీకాళహస్తి మండలంలోని ఉడమల పాడు పంచాయతీలోని ఉడమల పాడు, గోపాలకృష్ణాపురం దళితవాడల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి



చేయటానికి జగనన్న ప్రయత్నిస్తుంటే మధన్న నియోజకవర్గ అభివృద్ధి గురించి పాటు పడుతున్నారన్నారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారన్నారు. నవరత్నాల్లో భాగంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పవిత్రా రెడ్డి అన్నారు. రైతులకు నాలుగు విడతల రుణమాఫీ చేసారన్నారు. మహిళల కోసం దిశ చట్టాన్ని తీసుకొని వచ్చి ఆదుకున్నారన్నారు.నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించే నాయకులు కావాలా? లేక ఓట్లు వేయించుకొని హైదరాబాదుకు ఉడాయించే నాయకులు కావాలా? తేల్చుకునే సమయం ప్రజలకు ఆసన్నమైందన్నారు. మరో సారి మధనను గెలిపించి నియోజకవర్గాన్ని బంగారు మయం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.ఆమెతో పాటు సర్పంచ్ మనోహర్, ఎంపిటిసి రాములమ్మ, వైస్ ఎంపిపి భానుయాదవ్, కో ఆప్షన్ సభ్యుడు మునిరత్నం, మునిరాజాయాదవ్, సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, పెంచులయ్య, గంగయ్య, రమేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ



తొట్టంబేడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థి జితేంద్రవిష్ణు ఎడ్యుకేషన్ ఎవర్‌మెంట్ మెరిట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు ఎంఈవో భువనేశ్వరి తెలిపారు. ఈసందర్భంగా జితేంద్ర విష్ణు తిరుపతి జిల్లా ప్రధమస్థానంలో నిలిచాడని విజయవాడలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో నిర్వాహకుల నుంచి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడని ఎంఈవో తెలిపారు. ఈసందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈవో భువనేశ్వరి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్ర మణ్యం, నాగరాజు, సిఆర్ఎంటీలు మునిమోహన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి భవిష్యత్తుకు పునాది వైకాపానే..బియ్యపుశ్రీవాణి

తొట్టంబేడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చే పరిపాలన అందించేందుకు వైఎస్ ఆర్‌సిపి పార్టీని మరోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి సతీమణి బియ్యపుశ్రీవాణి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం



మండలంలోని కురవకనేరి, లింగమనాయుడుపల్లి, గుమ్మడిగుంట గ్రామంలో ప్రతి గడపలో జగనన్న పథకాల ద్వారా లబ్ధిపొందిన వారితో మమేకమవుతూ తాము గెలిచినప్పటి నుంచి అనునిత్యం ప్రజాసేవలో తరిస్తూ కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలచిన ఒకే ఒక వ్యక్తి తన భర్త బియ్యపుమధుసూదన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు రానునన సందర్భంగా నాలుగు సంవత్సరాలుగా కనిపించకుండా పోయిన వారందరు నేడు అందరిపై అబద్ధపు ప్రేమను చూపిస్తూ మోసం చేయాలని చూస్తున్నారని వారి మాటలను నమ్మవద్దని తెలిపారు. వితంతువులకు, వృద్ధులకు, ప్రత్యేక ప్రతిభావంతులకు ఫించన్లు పెంచిన ఘనత ఒక్క సిఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ముందుగా బియ్యపుశ్రీవాణికి తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నం వాసుదేవనాయుడు, ఎంపిపి ఉన్నంనిర్మల మరియు వైకాపా నాయకులు కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లునాయుడు, గంధంశ్రీను, వెంకట రామానాయుడు, కొప్పులరమేష్, మాజీ ఎంపిటిసి రత్నశేఖర్, మనోజ్, ఆనంద్, రాజేంద్ర, వెంకట య్య, సురేష్, కో ఆప్షన్ సభ్యులు ప్రేమ్‌కుమార్, పిఏసిఎస్ ఛైర్మన్ మణినాయుడు, కోవిచంద్రయ్యనాయుడు పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో...ద స్కూల్ విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : తిరుపతి కేంద్రంగా ఆదివారం హైదరాబాదులోని విశ్వం ఎడ్యుటెక్ వారి సారధ్యంలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో ద స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపరిచారని కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్ తెలిపారు. తమ పాఠశాల నుంచి 3,4,5 తరగతి విద్యార్థులు 9మంది పాల్గొన్నారన్నారు. వీరిలో 5వ తరగతి విద్యార్థులు ఎస్. సఫీయ, సీనియల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విజువలైజేషన్ రెండోస్థానంలోను బి.కోమలాదిత్య, ప్రత్యేక బహుమతితో నిలిచిందన్నారు. 4వ తరగతి వై.స్టీవెన్ ఆషర్, జూనియర్ స్థాయిలో-3లో ఉత్తమ ప్రతిభ కనపర్చిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.విశాల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## తిరుపతి అభివృద్ధిని చూసి వైసిపిలో చేరాం

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : తిరుపతిలో నేడు జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి సంతోషంతో వైఎస్ఆర్‌సిపి పార్టీలోకి చేరామని శివకుమార్, మంజుల, లతా రాయల్‌లు తెలియ జేసారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతిలో పలు రోడ్ల విస్తరణ, గంగమ్మ జాతర వంటి పలు



అభివృద్ధి కార్యక్రమాలు భూమన కరుణాకర్ రెడ్డి నేతృత్వంలో జరుగుతున్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో ఎంత కష్టపడినా కార్యకర్తలను గుర్తించడంలో విఫలమయ్యారన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తిరుపతిలో జరుగుతాయని, పూర్తి సమ్మకంతోనే ఈ పార్టీలో చేరామని వారు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాదర్ భాషా, ఎన్వి సురేష్, శేఖర్, లోకేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీని విమర్శిస్తే ఊరుకునేది లేదు..

### తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షురాలు శాంతమ్మ

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి మహిళలను ఎంతో గౌరవిస్తూ సముచిత స్థానం కల్పించారని, అటువంటి పార్టీ నుంచి వేరే పార్టీకి మారుతూ పార్టీని విమర్శించడం మంచి పద్ధతి కాదని లతా రాయల్‌కు ఆమె హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేసిందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ మహిళలకు ఎప్పుడు అన్యాయం చేయలేదన్నారు. ఎంతో భరోసా కల్పించి అక్కున చేర్చుకుంటుందన్నారు. అటువంటి పార్టీ నుంచి వైఎస్ఆర్‌సిపి పార్టీలో ఏదో తమ స్వంత స్వలాభం కోసం మారడం మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆమె అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అనిత, నీలిమ, పార్వతి, హేమలత, మంగమ్మ, భారతిలు పాల్గొన్నారు.

# అక్రమ డీకేటీ పట్టాను రద్దు చేయాలి : సీపీఎం ధర్నా



కేవీబీపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: మండలంలోని మోరేసికండ్రిగ గ్రామస్థులు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మా గ్రామం సమీపంలో సుమారు 10 ఎకరాల పశువుల కొరకు మేత పోరంబోకు భూమి ఉండేది. సదరు భూమిలో గ్రామంలోని కొందరు రెండున్నర ఎకరాలకు అక్రమంగా పట్టాలు చేసుకున్నారని విమర్శించారు. సీపీఎం సత్యవేదు నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఆరే లెక్కదాఖలో సర్వే నెం.247/3పీలో మేత పోరంబోకు భూమి 10 ఎకరాలు ఉండేదని గత 15 సంవత్సరాలుగా సదరు భూమిని పశువుల మేతగా గ్రామస్థులు ఉపయోగించుకుంటూ ఉండగా సదరు భూమిలో గ్రామంలోని కొందరు అక్రమంగా పట్టాలు చేసుకున్నారని విమర్శించారు. చెట్టు పుట్ట మీద ఉండంగానే సాగులో ఉన్నట్టు అధికారులని తప్పుదోవ పట్టించి అక్రమంగా పట్టాలు చేసుకున్నారని విమర్శించారు. కొందరు రాజకీయ నాయకులు భూ స్వాములు అధికారులకు మామూలు ఇచ్చి అక్రమంగా పట్టాలు పొంది ఉన్నారని వాటిని వెంటనే రద్దు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు, మోరస్ కండ్రిగ రైతులు వెంకటేశులు, రవి, శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పత్రిక ఫోటో గ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన



చంద్రగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: ఓ పత్రిక ఫోటో గ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఫ్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు నిరసన చేపట్టారు. నిరసన కార్యక్రమానికి టిడిపి, బిజెపితో పాటు ప్రజా సంఘాల నాయకులు తమ సంఘీభావం తెలిపారు. ఫోటో గ్రాఫర్‌పై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించి, మీడియా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ అమృతకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేకర్లతో పాటు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి, మండల యూత్ ప్రెసిడెంట్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉమాపతి రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యం యాదవ్, బిజెపి జిల్లా కార్యదర్శి కె.వెంకటముని, మండల ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ నాయుడు, రామ్మూర్తి, ప్రజా సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలకు చెందిన వెంకటపతి, బాదూరు యల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్‌పై దాడికి నిరసన

వరదయ్యపాలెం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త : సిద్ధం సభలో ఓ పత్రికా ఫోటో గ్రాఫర్‌పై జరిగిన దాడికి నిరసనగా సోమవారం వరదయ్యపాలెంలో ఫ్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన, ర్యాలీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ ప్రతాప్‌కు, తహశీల్దార్ ఉదయభారతికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగరాజు యాదవ్, సురేష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఎన్. హరిప్రసాద్ చౌదరి, దాము రాయల్, కుమార్, రమేష్ రెడ్డి, ఎన్టీఆర్ వెంకయ్య, మరికొందరు టిడిపి నాయకులు సిపిఐ మండల కార్యదర్శి తరుణ్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌లపై దాడి పిరికిపంద చర్య

సత్యవేడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: ఓ పత్రిక ఫోటో గ్రాఫర్‌పై వైసిపి నాయకుల దాడి ముమ్మాటికి పిరికిపంద చర్యేనని రాష్ట్ర మీడియా ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు గుత్తి త్యాగరాజు పేర్కొన్నారు. ఆదివారం సిద్ధం సభలో ఫోటోలు తీస్తున్న జర్నలిస్ట్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం సత్యవేడు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గడియారం కూడలి నుండి ర్యాలీగా తహసిల్ధార్ కార్యాలయంకు చేరుకుని జర్నలిస్ట్‌పై దాడికి యత్నించిన వారిపై న్యాయపరమైన చర్యలు చేపట్టాలని తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పాత్రికేయులు సామర్లహరి, సలీంభాష, నాగయ్య, రాహుల్‌గాంధీ, నాగరాజు, బెల్లంకొండ వెంకటేష్, శ్రీకాంత్, సోమురెడ్డి, గోపిరెడ్డి, మహేష్, శరవణ. రాజా, వేణు, సునీల్‌లు పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### - చిత్తూరులో విలేకరులు, ప్రతిపక్ష పార్టీల నిరసనలు

చిత్తూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: సిఎం బహిరంగ సభలో ఓ పత్రికా ఫోటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘ నేతలు, ప్రతిపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఎపిడబ్ల్యుజెయు, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట విలేకరులు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ధర్నా నిర్వహించారు. జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై సత్వరం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లోకనాథం, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో విలేకరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.

## ఫోటోగ్రాఫర్‌పై దాడికి జర్నలిస్టుల నిరసన

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : సిఎం సభలో ఓ పత్రికా ఫోటో గ్రాఫర్‌పై జరిగిన దాడిని ఫ్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఖండించారు. సోమవారం తిరుపతిలో గాంధీ విగ్రహం వద్ద జరిగిన నిరసనలో తిరుపతి కెమెరామెన్ అసోసియేషన్, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రముఖ నేతలు పాల్గొని ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఈ దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, అన్ని రాజకీయ పార్టీల ప్రముఖ నేతలు, ఫ్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో మీడియా ఆందోళన

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : అనంతపురం జిల్లా రాప్తాడులో ఓ మీడియా ప్రతినిధిపై వైకాపా కార్యకర్తల దాడిని ఖండిస్తూ సోమవారం శ్రీకాళహస్తిలోని మీడియా ప్రతినిధులు ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ధర్మా నిర్వహించారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్ సారధ్యంలో జరిగిన ఆందోళనలో ఆర్‌డిఓ కార్యాలయం పరిపాలనా అధికారి శరత్‌కు వినతి పత్రం అందించారు.

## ప్రజాస్వామ్యంపై పైశాచిక దాడి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : అధికార దాహం తీర్చుకోవడానికి అన్ని రకాల అడ్డదారులు తొక్కుతూ పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులను భౌతికంగా తుదముట్టించడమే గెలుపుకు ఏకైక మార్గమనే క్రూరమైన ఆలోచనతో జగన్‌రెడ్డిచేస్తున్న ఆటవిక పాలనలో భాగంగానే పైశాచికత్వం నిండిన వైసిపి శ్రేణులు ప్రజాస్వామ్య వ్యవస్థలపై దాడులు చేస్తున్నాయని తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జి.దశరధాచారి ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ పత్రిక పోటోగ్రాఫర్‌పై వైసిపి రౌడీ మూకలు పాశవికంగా దాడిచేసి తీవ్రంగా గాయపరచిన అమానుష సంఘటనను ఖండించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మిన్నల్‌రవి, డాక్టర్ యం.ఉమేష్‌రావు, భాస్కర్‌గౌడ్, డిల్లీబాబు, మునిరాజయాదవ్, భాస్కర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందెం రాయుళ్ళ అరెస్టు-4వేలు నగదు స్వాధీనం

తొట్టంబేడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : మండలంలోని రౌతుసూరమాల గ్రామంలో పుల్లూరు, పునబాక, శ్రీకాళహస్తికి చెందిన కొందరు కోడిపందెంరాయుళ్ళు కోడిపందేలు ఆడుతుండగా సమాచారం అందుకున్న తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తమ సిబ్బందితో దాడిచేయడంతో 9మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 2కోళ్ళు, 4వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

## మార్పుకోసం గ్లాసు గుర్తుకు ఓటు వేయండి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : మార్పుకోసం గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట అన్నారు. జనసేన విజయయాత్రలో భాగంగా ఎపి నీడ్స్ పవన్‌కళ్యాణ్ కార్యక్రమంలో భాగంగా 62వ రోజు పట్టణంలోని నాలుగుమాడవాధుల్లో పట్టణ అధ్యక్షుడు తోట గణేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానికులు ఆమెకు భారీ గజమాలతో క్రేన్‌ద్వారా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం పోరాడుతున్న జనసేన పార్టీని, పవన్‌కళ్యాణ్‌ను ఆదరించాలని గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. వైకాపా ప్రభుత్వంలో వ్యాపారస్తులు చితికిపోతున్నారని తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని మూడు మూడు రోజులకు ఏదో ఒక సాకుతో రోడ్లకు బ్లాక్ చేస్తే ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకునేలా పూర్తిగా సహకరిస్తే ఇబ్బందులు అన్ని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంగుంట ఎస్టీ కాలనీకి శ్మశాన స్థలం కేటాయించాలి : సీపీఎం ధర్నా

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:పుత్తూరు మండలంలోని తడుకు పంచాయతీలో రంగుంట ఎస్టీ కాలనీకి శ్మశాన స్థలం కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్టీ కాలనీ వాసులు గత 75 సంవత్సరాలుగా సర్వే నెంబరు 272 శ్మశాన స్థలంలో చనిపోయిన వారిని అంత్యక్రియలు చేస్తున్నారు. ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటామని పేపర్‌లో ప్రకటన ఇస్తున్నారు. చనిపోతే ఆరు అడుగులు వేసుకోవడానికి స్థలం ఇవ్వడంలో ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. అధికారులు స్పందించి సర్వే నిర్వహించిపేదలకు శ్మశనానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం పుత్తూరు తహసీల్దార్ వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ ఆ భూమిని సర్వే చేసి వారికి ఒక ఎకరా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా మండల సర్వేయర్‌కి వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పురుషోత్తం, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పిచ్చినాయుడు పల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



చంద్రగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : మండల పరిధిలోని పిచ్చినాయుడు పల్లిలో సోమవారం వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ కార్యక్రమాలను వాటి ద్వారా ప్రతి కుటుంబానికి లభించిన ప్రయోజనాలను లెక్కగట్టి మరీ ప్రతి గడపకు వివరించారు. గ్రామంలోని సమస్యలను ఆరా తీస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతూ ముందుకు సాగారు. 2024 ఎన్నికలలో ఎంఎల్‌ఏ అభ్యర్థి తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కి నగరి విద్యార్థి



నగరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు నగరి మున్సిపాలిటీ చింతల పట్టెడకు చెందిన సి.జి.షారిని ఎంపికైంది. స్థానిక ఎస్వీ విద్యానికేతన్‌లో 8వ తరగతి చదువుతున్న షారిని తడి బట్టల్లోని నీటిని పిండడానికి పరికరాన్ని తయారు చేసి చేపట్టిన ప్రయోగం రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైంది. ఈ ప్రయోగాన్ని చేసిన విద్యార్థినిని గైడ్ టీచర్ కవితను ప్రధానోపాధ్యాయుడు పెరుమాళ్ అభినందించారు.

## కొత్తూరులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

### ప్రబలుతున్న అంటురోగాలు-భయాందోళనలో గ్రామస్తులు

కేవీబీపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: మండలంలోని ఎస్ఎల్ పురం, కొత్తూరు, కేవీబీ పురం, పెరిందేశం, కోవనూరు, కళత్తూరు, సదాశివపురం తదితర గ్రామాల్లో మురుగునీరు ఎక్కడబడితే అక్కడ నిల్వ ఉండడంతో అంటు రోగాలకు నిలయంగా మారుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు కదలకపోవడంతో దోమలు వృద్ధి చెంది అనేక అంటు రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు అంటున్నారు. సంబంధిత విషయంపై అధికారులకు, నాయకులకు విన్నవించుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్న స్థాయి అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## తాగునీరు అందించండి మహాప్రభు..!

కేవీబీపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: మండలంలోని ఆరే ఎస్టీ కాలనీలో తాగునీటి కొరకు ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ సందర్భంగా ఎస్టీ కాలనీ వాసులు మాట్లాడుతూ సుమారు రెండు నెలలుగా గుక్కెడు తాగునీరు లేకపోవడంతో మా ఎస్టీ కాలనీలోని ప్రజలందరూ అడవిబాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. ఈ గ్రామానికి తాగునీరు అందించే విద్యుత్ మోటారు మరమ్మతుకు గురి కావడంతో రెండు నెలలుగా తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని వారు తెలిపారు. సంబంధిత విషయాన్ని అధికారులకు నాయకులకు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్టీ కాలనీకి తాగునీరు అందించే చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

## రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : డాక్టర్ హెలెన్



నారాయణవనం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : మండలకేంద్రలోని బ్రాహ్మతాంగేల్ గ్రామ పంచాయతీలో సోమవారం బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేదు నియోజకవర్గం టిడిపి ఇంచార్జీ డాక్టర్ హెలెన్ హేమలత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుంద న్నారు. అలాగే ప్రజలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. టిడిపి-జనసేన పార్టీలు 2024లో జరిగే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలవడం జరుగుతుందన్నారు. పిల్లల భవిష్యత్తుకు టిడిపి మద్దతు ఇవ్వాలన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలతో ఓడిపోవడం ఖాయమన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పి గిరిబాబు, కెవిబిపురం మండల అధ్యక్షులు మునస్వామి యాదవ్, మండల క్లస్టర్ ఇంచార్జీ టి.షణ్ముగం, నాయకులు కెఎస్‌రవి, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కుప్పయ్య, మురుగేశంరెడ్డి, కె వాసుదేవన్, ఆరుముగంశెట్టి, గాండ్ల రమేష్, పిపి లక్ష్మణన్, కందస్వామిమొదలియార్, మారిముత్తు, శరవణ, కన్నదాసు, మహేష్, మాజీ సర్పంచ్ నందగోపాల్ మోహన్, కె గోపి, శేఖర్, మునివేలు, ఉష, సిపిఐ మహేష్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన ర్యాలీ

నారాయణవనం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణ వనం మేజర్ పంచాయతీలో సోమవారం దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర రాఘసుధ, హెల్త్ ఎడ్యుకేట్ రామచంద్ర, పంచాయతీ ఇఓ షణ్ముగంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు వస్తుందన్నారు. రోగాలను



నివారించాలంటే తప్పక పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. ప్రతి వేడి చేసిన నీటిని తాగాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలన్నారు. అలాగే నీటి గుంతలను పూడ్చేయాలని, వాటిలో నీటి నిల్వ వల్ల లార్వాలు ఉత్పత్తి అవుతుందన్నారు. ఈ ర్యాలీలో పంచాయతీ కార్యదర్శి సరిత, ఆరోగ్య కార్యకర్తలు సుధాకర్, జయలక్ష్మి, వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

